# గేదెలగోవిందయ్య !

నీటిలో వున్న పశువు కొమ్ములు చూసి ఎలా బేరమాడరాదో... దాని సుడులు చూడకుండా కళ్లు మూసుకుని ఏ గొడ్డునూ కొనరాదు. కొనరు! అదిరూలు!

జాతకాలు చూడటానికి ముహూర్తాలు పెట్టటానికి సిద్ధాంతి స్పెషలిస్ట్ అయితే మంచి పశువు అవునో కాదో దాన్ని కొనవచ్చో కొనకూడదో... కొంటే లాభమా...నష్టమా అని జ్యోసం చెప్పేవాళ్లూ వున్నారు. అలా చెప్పగలవారిలో గేదెల గోవిందయ్య ఎక్స్‌పర్ట్!

గోవిందయ్య చెవిలో జోరీగై ఆగేదెను కొనవద్దని గీపెడుతున్నా చూపులకు బావుంది. ఇటివలే ఈనింది. నాలుగు సేర్లు పాలు రెండు పూటలు ఇస్తుందనేసి ఆశపడి మరీ ఓ గెదెను కొన్నాడు సుందరయ్య! చాలాకాలం తర్వాత పాడిగేదె ఇంట్లో వుంటే అన్నివిధాల ప్రయోజనమే కాదు ఇరుగు పొరుగు వారికి పాలు అమ్మితే డబ్బులొస్తాయ్ కూడా అనే దూరాలోచనతో బేరమాడి సంతలో ఠక్కున బయానా ఇచ్చి కొనేశాడు. మిగతా డబ్బు ఇంటి కొచ్చి పట్టు కెళ్లమని గేదెను దూడను ఇంటికి తోలుకెళ్లాడు.

గొడ్డొచ్చిన వేళ... బిడ్డొచ్చిన వేళ అని పెద్దలు వూరికే అన్నారా?... పాడిగేదె కావటాన అది నిగ నిగలాడుతూ... పెద్ద కొమ్ములతో... చూడముచ్చటగ వుండే పొదుగుతో సుందరయ్యను ఆకట్టుకుంది.

గేదె ఇంటి కొచ్చిన వారం రోజులకే సుందరయ్య తల్లి అకస్మాత్తుగా కన్ను మూసింది. పోనీలే ముసిల్ది కదా... ఎనభై దాటిన మనిషి అనేసి అందరూ సరిపెట్టుకున్నారు. నెలతిరిగే సరికి తాంబూలాలు పుచ్చుకుని కూతురి పెళ్లి సంబంధం ఖాయం చేసుకున్నది కాస్తా... కథ అడ్డం తిరిగి ఏదోవంకతో మగపెళ్లి వారు మంగళంపాడారు ఇదేం ఖర్మరా బాబూ అనేసి ఇంటిల్లిపాదీ లబలబ మొత్తుకున్నారు. ఈ విధంగ గేదె ఇంటి కొచ్చిన నాటి నుండి అన్నీ అపశకునాలు... ఇబ్బందులు ఎదురౌతూండటంతో సుందరయ్య మనసు కలత చెందింది.

అనుకోకుండా ఒక రోజు గేదెల గోవిందయ్య వీధిలో తారసపడినప్పుడు తనబాధలన్నీ సుందరయ్య ఏకరువు పెట్టాడు.

'నే చెప్తే విన్నారా? అప్పటకి ఈ గేదె సుడులు బాగోలేవండి... సంఖ్య

తప్పుతోంది...మీకు అచ్చిరాదని చిలక్కి చెప్పినట్టు చెప్పాను. నామాట విన్పించుకోకుండా మీ నిర్ణయం మీరు తీసుకున్నారాయె....చూడండి ఇప్పుడేమైందో? నా మాటవిని ఎంతకో అంతకు ఆగేదెను తెగనమ్మండి. నష్టమొచ్చినా పర్వాలేదు. ముందు దాన్ని వదిలించుకోండి. లేకుంటే ఇంకా ఏమనర్థాలు జరుగుతాయో వూహించలేం... ఇప్పటికైనా నా మాట మీద విశ్వాసముంచి.... నే చెప్పినట్టు చేయండి! సుడులు అవీ సరిగ్గా వున్నమరో గేదెను నేను మీకు మాట్లాడి పెడతాను... అని చెప్పేసి... కాదు వాస్త వాన్ని కుండబద్దలు కొట్టేసినట్టు మాట్లాడిన గోవిందయ్య ముందుకు సాగిపోయాడు.

మనషుల విషయంలోనూ ఇలాగే జరుగుతూంటయ్. ఒక్కోకొత్త పెళ్లి కూతురు అత్తారింట్లో కాలు పెడితే అన్నీ అనర్థాలే! అత్త ధమాలో... మామ మంచానపడి 'హరీ' అనటమో... భర్త వుద్యోగానికి వుద్వాసనో... ఇలాఎన్నో...ఎన్నెనో?- ఇలాంటివి కేవలం ఆడవారికే పరిమితం కావనేది కటికవాస్తవం।

కొత్త అల్లుడు ఇంట్లో అడుగు పెట్టినా....నష్ట జాతకుడైతే...అమామ గారిల్లు రావణ కాష్టమే! ఏదీ కలిసిరాదు!....దుష్టగ్రహాల వీక్షణ అలా ఏడుస్తుంది....ఏడిపిస్తుంది. పిల్లాడు అందగాడనో....ఎక్కువ సంపాదించేవాడనో....కట్నానికి ఆశపడక పిల్లను చూచి ఇష్టపడ్డాడనో అనుకుని నిర్ణయాలు తీసుకుని వివాహం జరిపిస్తే.....అణుబాంబును పక్కలోపెట్టుకున్నట్టే.

జాతకాలు మూఢ నమ్మకమంటూ టి.వి.లు ఘోషిస్తున్నా...అనేకులకు అపనమ్మకమున్నా....జరగాల్సిన అనర్థాలు జరుగుతూనే వుంటయ్. అడ్డుకుంటే ఆగవ్! ఎవరి నమ్మకం వారిది అలాంటి దాన్ని మూఢ విశ్వాసం...గుడ్డి విశ్వాసం అని కొట్టిపారేస్తే....నష్టపోయేది మనషులే...ముహుర్తం పెట్టిన సిద్ధాంతి కాదు..... మేళాలు వాయించిన భజంత్రీలూకారు.

దేనికైనా సుడి వుండాలి అనేది సామెత। మగాళ్లకు నెత్తిన సహజంగా ఒకసుడే వుంటుంది. రెండు సుడులువున్న వారూ వుండకపోరు. ఒరేయ్....వీడినెత్తి న రెండు సుడులున్నాయిరా....వీడికి ఇద్దరు పెళ్లాలుంటారు....అనేసి పిల్లలను చిన్నతనంలో పెద్దలు ఏడిపిస్తుండటం కద్దు! ఒకటి వుంటే నార్మల్!...అంతకుమించివుంటే ఆబ్నార్మల్ అన్న మాట!

ఇలాంటివే...గొడ్ల కొనుగోలు....అమ్మకాల విషయంలోనూ పాటించటం సహజం! గొడ్లమాట పక్కన పెట్టినా....పాడిగేదెలు.... అవుల విషయంలో ఈ సాంప్రదాయం అక్షరాల వర్తించి తీరుతుంది.

గేదెలను కొనాలనుకునే వారంతా గోవిందయ్య లాంటి మధ్యవర్తులైన వారిని తప్పక సంప్రదించి....సలహాతీసుకుని....పాటిస్తూంటారు....ఇప్పటికీ!....ఎప్పటికీ!!

చుట్టుపక్కలవున్న పది గ్రామాలపరగణాలో గేదెల గోవిందయ్యంటే తెలియనివారు లేరు. ఈ విధ్య అతనికి వక్కడికేవచ్చు! పోటీలేని కేండిడేట్! ఈవ్యాపారంలో....మధ్యవర్తిత్వంలో ఆదాయం బాగావుండటంతో సొంతడాబా ఇల్లుకట్టుకుని....అయిదెకరా పొలం కొనుక్కోగల స్థాయికి ఎదిగాడు.

బేసి సంఖ్యలో సుడులున్నగొడ్లుగాని మనష్యులు గానీ యమడేంజర్! మనషులైతే కొంపలు ఆర్పేస్తారు. ఎక్కడ కాలు పెడితే అక్కడ మటాషే! ఇలాంటి వారిని అమడదూరంలో వుంచాలి బందుత్వం కలుపుకుంటే ఇంతే సంగతులు!

కరణంగారికి లేక లేక కలిగిన మగపిల్లవాడికి మూడుసుడులు నెత్తినవున్నాయనే వార్త గ్రామమంతా దావానలంలా పాకింది! ఊరికేమైనా కీడు వాటిల్లు తుందేమోని హడలిపోయారంతా. కరణంగారిదంపతులకు ఏడుపాకటే తక్కువ! ఏమైనా కన్నబిడ్డను వీధిలోకి విసిరేయలేరు కదా!. పొత్తిళ్లలో వుండ గానే కన్నతల్లిని పొట్టన పెట్టు కోవటంలో కృంగిపోయాడు కరణం! రెండవ ఏట కరణం సిటీకెళ్లి తిరగొస్తూండగ బస్సు ప్రమాదంలో మరణించటం చూచి పసివాడిని అందరూ ఈసడించుకున్నారు. దగ్గర బందువులు ఆ పిల్లవాడిని ఆశ్రమానికి అప్పగించి పెంచిపెద్ద చేయమని వేడుకున్నారు. సమస్త ఖర్చుల క్రింద పిల్లవాడికోసం ఏడాదికి ఇంత ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు.

చదువు సంధ్యల్లేకపోయినా గోవిందయ్య గేదెలను ఎంపిక చేయటంలో నిష్ణాతుడు. ఆతగాడి తాత తండ్రి కూడా ఇదే పని చేసేవారు. వారి అసలు ఇంటిపేరు మరుగునపడి పోయి గేదెల వారుగ స్థిరపడింది. తండ్రి గేదెలసుబ్బయ్య! తాత గేదెల రాఘవయ్య! గేదెల అని అంతా పిలుస్తూండటంతో ఆపేరు అన్నివిధాలుగ అచ్చొచ్చి....గోవిందయ్యను కూడా అందరూ గేదెల గోవిందయ్య అనే పిలవటానికి అలవాటు పడ్డారు.

కాలక్రమేణ పాడిపరిశ్రమ అభివృద్ధి చెందటంతో గ్రామంలో గేదెల.....అవుల సంఖ్య రెండింతలైంది! సైకిళ్లకు పాల బిందెలు కట్టుకు తీసుకెళ్లి పాలు అమ్మటం ఎక్కువైంది. సైకిళ్ల స్థానంలో నాగరికత పెరిగినందున స్కూటర్ల మీద క్యాన్లతో పాలు అమ్మటం వాడుకలో కొచ్చింది.

ఢిల్లీ ఎనుములైతే పాతిక శేర్ల పాలిస్తాయనే వార్త అన్ని గ్రామాలలో పాకటంతో....నాటు గేదలతో పాటు వాటిని కూడా ఖర్చు ఎక్కువైనాసరే గ్రామస్తులు కొనటానికి ఢిల్లీ పరిసర ప్రాంతాలకు వెళ్లటానికి సిధ్ధపడ్డారు.

అందరూ అంతదూరం వెళ్లలేక ఎవరెవరికి ఎన్నెన్ని గేదెలు కావాలో లిస్ట్ రాయించుకుని ఆ ప్రకారం డబ్బు గోవిందయ్య కిచ్చి ఒకరిద్దరు పెద్దమనుఘులు గోవిందయ్య వెంట ఢిల్లీ వెళ్లటానికి సిద్ధపడ్డారు.

గోవిందయ్యకు ఢిల్లీ కొత్తేంకాదు! పరిసర ప్రాంతాలన్నీ కొట్టిన పిండి! లోగడ చాలా సార్లు వచ్చి ఎనుములను ఎన్నిక చేసి వాటిని లారీల్లో తరలించుకు రావటం అలవాటే!

ఈ సారి వంద గేదెలను కొని వాటిని లారీల ద్వారారవాణా చేయించే ప్రక్రియలో అతగాడికి లాభం బాగానే గిట్టు బాటయింది. గోవిందయ్య ఖర్చులన్నీ వారే భరించారు.

గేదెల గోవిందయ్యంటే అపరచాణుక్యుడు! దూరాలోచన...వ్యవహార నిర్వహణలో అతని కతనే సాటి.

ఈయన గారికి ఇద్దరు భార్యలు! ఒకరు సాంప్రదాయ బద్ధంగ వివాహమాడిన మనిషైతే.... రెండో ఆవిడను అనధికారంగా దగ్గరకుతీశాడు.రెండవ ఆడమనిషితో మొగుడు సంసారం చేస్తున్నాడని తెలిసి నోరు మెద పలేకపోయింది పెద్దావిడ రుక్మిణమ్మ. కారణం....తనకు కడుపున సంతానం కలుగక పోవటమే! వుంచుకున్న సత్యకు ఇద్దరూ మగపిల్లలే! ఆకారణాన రుక్మిణి సత్యలు పొరపొచ్చాల్లేకుండా సఖ్యతగ వుండటం విశేషం!

మగపిల్లలిద్దరూ బేధభారం లేకుండా రెండిళ్లకూ తిరుగు తూంటారు. రెండో భార్యక్కూడ విడిగా ఇల్లుకట్టించాడు గోవిందయ్య. వంటినిండా నగలు కొనిదిగేశాడు. ఊళ్లో ఎవరింటికి వెళ్లాల్సవచ్చినా....ఇద్దరు పెళ్లాలను వెంటతీసుకుపోతూంటాడు గోవిందయ్య

మనుష్యుల్లో సహజంగవుండే రాగ ద్వేషాలు పశువుల్లోనూ కన్పిస్తయ్. ఇష్ఠంలేని వాడో....కొత్త మనిషో పాలు పితకాలనే ప్రయత్నంలో పొడుగు పట్టుకుంటే కాలితో తంతూవుంటాయ్...ఇంకొంచెంమొండిగా ప్రవర్తిస్తే...కొమ్ములతో పొడిచే ప్రయత్నం చేస్తయ్. దూడల విషయానికొస్తే....తనదో...పరాయిదో పశువులూ గురిస్తయ్! పశువులను యజమాని అమ్మినపుడు కొన్నవాళ్లు లాక్కెళ్లబోతే మొరాయిస్తయ్. వారితోవెళ్లనంటూ మొండికేస్తయ్! ఆక్షణాన పసిపిల్లల ప్రవర్తన గుర్తుకు రాకమానదు! పాలు కొని వినియోగించుకునే వారికి పశువుల ప్రవర్తన....వాటి మంచితనం... అలవాట్లు... అభిమానం గురించి తెలియదు. వాటిని మేపేవారికే మంచి చెడుల గురించి బోధపడతయ్! గొడ్లను తమ బిడ్డలతో సమానంగా అపురూపంగ. ప్రేమగా చూసుకోవటం కద్దు! రెండు కొత్త గొడ్లను ఒకే చోట కట్టేస్తే కుమ్ము కుంటయ్ రూలింగ్ పార్టీ వారికి అపోజిషన్ వారితో సఖ్యత లేనట్టు !

గోడ్ల వ్యాపారంలో బ్రోకర్ వృత్తి చేపట్టిన నాటి నుండి గోవిందయ్యఎన్నో వందల గొడ్లను తన చేతులమీదుగ అమ్మించటం.... కొనిపించటం జరిగింది. ఈ విషయంలో గిన్నీస్ బుక్ ఆఫ్ వర్ల్డ్ రికార్డులోకి ఎక్కవలసిందే గోవిందయ్య పేరు! అంతటి అనుభవశాలి.

కానీ తను మాత్రం గేదెను గాని ఆవునుగాని స్వప్రయోజనానికి కొనుక్కోలేదు. అందుక్కారణం వాటికి చాకిరీ చేయలేకపోవటమే అంటాడు. గొడ్లు అతడి నేస్తాలు. అవే గోవిందయ్య సమస్తం! గోవులమంద నడుమ గోపాలుడున్నట్టు....గోవిందయ్య జీవితం గొడ్లమధ్యనే గడిచిపోతోంది.

గోవిందయ్య రెండు ఫామిలీస్‌కి... కావలసినన్ని చిక్కటి పాలు... గడ్డపెరుగు... వెన్న... కాచి ఘుమఘుమ లాడే నేతిని ఫ్రీగా ఇస్తుంటారు అతని పట్ల గల అభిమానంలో.

దొడ్డిలో వున్న ఖాళీ స్థలంలో మాత్రం ఆడవారు... పొట్ల... సొర... బెండ... వంగ... పాలకూర... తోటకూరవంటి మొక్కలు వేసి అవి కాపుకు రాగానే అవసరం మేరకు ఇంట్లో వాడుకుంటూ మిగిలినవి సంతకు పంపి అమ్మి డబ్బు చేసుకోవటం గోవిందయ్య ఇద్దరి భార్యలకు అలవాటు.

తన పొలం కౌలుకివ్వగా వచ్చే ధాన్యాన్ని అవసరం మేరకు వుంచుకుని మిగతా

వడ్ల బస్తాలను మిల్లుకు తరలించి అమ్మి డబ్బు చేసుకుంటూవుంటాడు గోవిందయ్య.

ఏమైనా గోవిందయ్య గేదల వ్యాపారంలో బోలెడంత సంపాదించాడు. ఎక్కడికెళ్లాలన్నా మోటారు సైకిలు మీద వెళ్లొస్తుంటాడు. కారు కొనమని ఇద్దరు భామలు (సారీ! భార్యలు) వేధిస్తున్నా... కారు కొనేటందుకు ఇష్టం లేదు. అందుక్కారణం కారుట్రబులిస్తే....దాన్ని రిపేరు చేసే మెకానిక్కులు అందుబాటులో లేకపోవటమే!

పైగా....తన వ్యాపారానికి కారుతో పనిలేదు. కారు అంటే మాటలా? బోలెడంత పెట్రోలు తాగేస్తుంది పెట్రోలు ధర రోజురోజుకీ ఆకాశాన్నంటుతున్న దాయె! ద్విచక్ర వాహనం వుండనే వుంది తన అవసరాలు తీరుతునే వున్నయ్. అలాంటప్పుడు కేవలం గొప్ప కోసం కారు దేనికంటాడు.

ఎదిగిన పిల్లలిద్దరినీ సిటీలో చదివిస్తున్నాడు హాస్టల్లోవుంచి. వారానికోసారి వెళ్లి కొడుకులను చూసివస్తూంటాడు గోవిందయ్య. అప్పుడప్పుడు భార్యలను కూడా తనవెంట తీసుకెళ్లి కాలక్షేపం చేసొస్తూంటాడు! ఎవరికీ ఎలోటూ రానీకుండా చూచుకునే మంచి మనసు గోవిందయ్యకుంది!

ఇంత సంపాదించాక కూడా....ఇంకాగొడ్ల బ్రోకరు యాపారందేనికండీ...? రెండోపెళ్లాం ఒకరోజు గోవిందయ్యను నిలదీసింది.

పిచ్చిమొహమా!.... ఈ బిజినెస్‌లోనేనే మనం లక్షలు సంపాదించింది: ఈ మాలచ్చిమిని కాదనుకుని ఇంటికాడ గోళ్లు గిల్లు కుంటూ కూకుని తింటావుంటే కొండలైనా కరిగిపోతాయ్. రెండు ఫామిలీలు దర్జాగ బతకాలంటే........ సచ్చే దాకా కట్టపడక తప్పదు. పైగా నేనేమైనా మందిని ముంచుతున్నానా? దొంగ తనం చేస్తున్నానా? కట్టం చేసి సంపాదించుకోవటానికి లిమిటేం లేదు....అన్నాడు. వామ్మో నామొగుడో! నీకు సదువు లేక పోయినా ఎన్ని ఇసయాలు మాట్లాడినావయ్యా....నువ్వునిజంగా నా బంగారానివే...వయసు మళ్లినా గోవిందయ్యతో సరసమాడింది.

X X X

అడవిలో వేటాడే ఆటవికులు సైతం ఏదో ఒక నాడు క్రూరమృగాల బారినపడక తప్పదు! పాములను పట్టి ఆడించేవాడు చావుకూడా పాముకాటుతోనే అంతమౌతుంది. సర్కస్‌లో సింహాన్ని ఆడించే రింగ్ మాస్టర్ జీవితం కూడా సింహ

నోటికిచిక్కి హరీ అనక తప్పదు ఎప్పుడో ఒకప్పుడు!

సాయం సంధ్య వేళ చౌదరిగారు రమ్మని కబురంపటంతో బండిమీద బయల్దేరాడు గోవిందయ్య

బండిదిగి స్టాండ్ వేసి నమస్తే సౌదరిగారూ... గొడ్ల కొట్టంతో వున్న ఆయన్ను చూసి నమస్కరించాడు

'రాగోవిందయ్యా రా'

'నాకోసం కబురెట్టారంట'

'అవునయ్యా! నీతో మాటమాత్రమైనా ముందుగ చెప్పకుండ రెండుగేదెలను కొత్తగా కొన్నాను....

'ఉన్నవి చాలక నంటండీ!'

'మరేం లేదు మనూరి పొలి మేరల్లో పాలఫ్యాక్టరీ రాబోతోందికదా....రేపోమర్నాడో అది పాల కలక్షను మొదలు పెడుతుంది. మన గ్రామంలో అందరికంటే నేనే ఎక్కువ పాలు సప్లై చేయాలనే దూరాలోచనతో వీటిని కొన్నాను. మరో పది ఢిల్లీ బర్రెలను కొందామనే ఆలోచనలో వున్నాను! ఈ వారంలోనే మనిద్దరం ఢిల్లికి పోవాల... మనసులో ఆలోచన చెప్పాడు.

'అట్టాగే....మీ మాట కాదంటానా?....'

'ఆద్సరే...నేను కొన్న గేదెలు ఎట్టా వున్నాయో.... మంచివి అవునో కాదో చెప్పాలి వాటిని చూసి'....కొట్టంలో తిరుగుతూ అన్నాడు! చౌదరి వెంట గోవిందయ్య చేతులు వెనక్కు పెట్టు కుని నడుస్తున్నాడు గొడ్ల కొట్టంలో.

తలవని తలంపుగా...కొత్తగేదెలు పలువుతాళ్లు తెంపుకుని...వెనకనుంచివచ్చిన ఒక గేదె తన వాడైన కొమ్ములతో గోవిందయ్యను కుమ్మింది... ఆకస్మిక పరిణామానికి వెన్నులో కొమ్ము దిగటంలో దభాలున కింద పడ్డ అతడిని తొక్కుకుంటూ పరుగు పెట్టింది బెదిరిన రెండో గేదె!

నేల మీదపడ్డ గోవిందయ్య గిలగిలా తన్నుకుంటూ నెత్తురుకక్కుకుని అక్కడి కక్కడే మరణించాడు! గేదెల గోవిందయ్య ప్రాణం చివరికి అనూహ్యంగ గేదెల మూలానే పోవటం కేవలం యాదృచ్ఛికమే అయినా విధివ్రాత!!

--- సమాప్తం ---